

వాకర్స్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వాకర్స్ సమస్యలను పరిష్కరిస్తా

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ఆటోనగర్ డీర్ పార్కు వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ నర్సింహారెడ్డిని వారు కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ మంగళవారం మార్నింగ్ వాక్ చేపట్టి వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డీర్ పార్కు ఆనుకుని ఉన్న జాతీయ రహదారి సబ్‌రోడ్‌పై చిరు వ్యాపారుల మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ అధికారులు సమన్వయం చేసుకుని సర్వీస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన బారీకేడ్లను తొలగించాలన్నారు. అదేవిధంగా డీర్ పార్కులో ఓపెన్ జిమ్‌లను మరింతగా ఏర్పాటు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్‌యాదవ్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలనీ సంక్షేమ సంఘం సభ్యులను సన్మానించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

కాలనీలను అభివృద్ధి చేస్తాం

- బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి కాలనీలను అభివృద్ధి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు, కాలనీవాసులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మంగళవారం కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చెస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పురుశోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, కోశాధికారి నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు రాములు, రవికిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, అలెగ్జాండర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్ తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ సుధీర్‌బాబు

అనసూయకు నేతల నివాళి

హయత్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయ ప్రథమ వర్ధంతిని మంగళవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని త్యాగరాయనగర్ కాలనీలో గల ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరై మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.

● ఎస్‌ఐకి సన్మానం



ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చాదర్‌ఘాట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురళిని ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు మగళవారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి, శాలువాతో సత్కరించారు. ఎస్‌ఐని కలిసిన వారిలో నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, చేగిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, రామక్రిష్ణ, తదితరులు ఉన్నారు.

- ఓల్డ్‌మలక్‌పేట ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి)



ఉచిత వైద్యశిబిరం

వెంకటేశ్వరకాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ఓజోన్ ఆస్పత్రి, విన్ విజన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గండు ధనరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు కంటి పరీక్షలు, మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు అరుణ, భవానీ, సంజన, అంజలి, అనిల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కనకరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్, సంయుక్త కార్యదర్శి మధుసూదనర్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, నరేష్, మాధవరావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- ఎల్‌బీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)



చలివేంద్రం ప్రారంభం

శాలివాహననగర్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, లక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పున్‌రెడ్డి కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు రామాచారి, కార్యదర్శి పి.కమలాకర్, కోశాధికారి యాదయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

- చాదర్‌ఘాట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)

రోడ్డు ఎత్తు తగ్గిస్తామని తవ్వారు..

మళ్లీ అదే ఎత్తులో వేస్తున్నారు!

- బడంగ్‌పేట్‌లో ఇంజనీరింగ్ అధికారుల వింత ధోరణి
- లక్ష్మీనగర్ రోడ్డు పేరుతో రూ.5లక్షలు ప్రజాధనం వృథా
- వాహనాలు వెళ్లేలా ఏటవాలుగా నిర్మించాలని స్థానికుల వినతి



తవ్విన రోడ్డుపై మళ్లీ అంతే ఎత్తులో వేయడానికి పోసిన కంకర కుప్పలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో రెండు కాలనీల మధ్య ఎత్తుగా ఉన్న ఓ చిన్న లింకు రోడ్డును ఏటవాలుగా నిర్మించడానికిగాను రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సదరు నిర్మాణం కోసం ఇటీవల అధికారులు ఎత్తుగా ఉన్న పాత సీసీ రోడ్డును తవ్వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. తాజాగా వేసే రోడ్డు ఎత్తు మునుపటిలాగే ఉంటుండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'అంత మాత్రానికి పాత రోడ్డును తవ్వడం ఎందుకు.. తిరిగి అంతే ఎత్తులో రోడ్డు నిర్మించడం ఎందుకు?' అని వారు ప్రశ్నిస్తున్నారు. అల్మాస్‌గూడలోని ఎస్ఎస్‌ఆర్‌నగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల మధ్య నలుగుతున్న సమస్య ఇది!

రూ.5లక్షలు వృథాయేనా..!

రోడ్డుకు అటు మూడు.. ఇటు మూడు చొప్పున మొత్తం ఆరు ఇళ్లు ఉండగా సదరు దూరం సుమారు 30 మీటర్లదాకా ఉంటుంది. ఆ చిన్న దూరంలోని రోడ్డు వాహనాలు వెళ్లలేని విధంగా ఎత్తుగా ఉండడంతో దానిని తవ్వి దిగువన గల రోడ్డుకు సమాంతరంగా నిర్మించాలన్నది అసలు ఉద్దేశం. కానీ, ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పనులు చూస్తే గతంలో ఎంత ఎత్తులో ఉందో తాజాగా నిర్మించే రోడ్డు మళ్లీ అదే ఎత్తులోకి వస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటప్పుడు రోడ్డును తవ్వడం ఎందుకు.. తిరిగి అంతే ఎత్తులో నిర్మించడం ఎందుకు.. ప్రజాధనం వృథా చేయడం ఎందుకు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అవగాహన లేమి కారణంగా 30 మీటర్ల రోడ్డు కోసం రూ.5లక్షలు వృథా అయినట్టేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నిధులు ఖర్చయినా లక్ష్యం నెరవేరుతుందా? అంటే అదీ లేదు. తవ్విన ప్రాంతం నుంచి దిగువన గల రోడ్డు వరకు ఏటవాలుగా నిర్మిస్తేనే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని, దిగువ రోడ్డు వద్ద మళ్లీ ఎత్తుగా నిర్మిస్తే ఆ దారి ఉపయోగపడదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పొరపాటును సరి చేసుకుని స్థానికుల అవసరానికి అనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపడతారా.. లేక పాత రోడ్డు ఉన్నట్టే నిర్మిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

ఏటవాలుగా నిర్మిస్తేనే ఉపయోగం

తవ్విన రోడ్డు స్థానంలో ఏటవాలుగా నిర్మిస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది. లేకపోతే నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరే. అధికారులు రెండు కాలనీలను సమన్వయం చేసి సరైన పద్ధతిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలి. పాత పద్ధతిలో ఎత్తుగా నిర్మించి నిరుపయోగంగా మారిస్తే మాత్రం మా కాలనీ తరఫున హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

- సాయిబాబా, లక్ష్మీనగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి

తిరోగమనంలో కాంగ్రెస్ పాలన

- మూడేళ్ల తర్వాత మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తిరోగమనంలో ఉందని, ఏ వర్గాన్ని కదిలించినా అసంతృప్తే కనిపిస్తోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసే నిమిత్తం మంగళవారం బడంగ్‌పేట్‌లోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో సబితారెడ్డి పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ముందస్తు హామీ లేకుండానే ఎన్నో కొత్త పథకాలు ప్రవేశపెట్టారని, ప్రస్తుత రేవంత్ సర్కార్ మాత్రం ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదని ఆమె ఆరోపించారు. మూడేళ్ల తర్వాత రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌లో నిర్వహించనున్న సభకు స్వచ్ఛందంగా తరలివచ్చే తెలంగాణ అభిమానులకు, పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నాయకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ రైతు సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, మీర్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆనంద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురషోత్తంరావు, భూపాల్‌రెడ్డి, అరవింద్‌శర్మ, హమీద్, మాధవీవెంకటేశ్వరరావు, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కేంద్రం వైఖరి

- గాంధీ, అంబేడ్కర్ జాడలు లేకుండా చేయాలనే కుట్ర
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి ధ్వజం



జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్రలో పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు భారత రాజ్యాంగాన్ని అవమానరిచేలా ఉందని, గాంధీ, అంబేడ్కర్ జాడలు లేకుండా చేయాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆరోపించారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌లో భాగంగా మంగళవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో నిర్వహించిన పాదయాత్రలో రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం పారిజాతారెడ్డి మాట్లాడుతూ దేశంలోని కొన్ని శక్తులు రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను, స్వాతంత్ర్య సమరయోధులను అవమానించేలా వ్యవహరిస్తున్నాయని, అందుకే కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఆయా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నదని వివరించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, దానిని మార్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి: ఎస్‌ఐ కోటేశ్వరరావు

ఉప్పల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కాలనీ సంక్షేమ సంఘాల సహకారం ఎంతో అవసరమని ఉప్పల్ అడ్మిన్ ఎస్‌ఐ కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం చిల్కానగర్ డివిజన్ పరిధిలోని దాదాపు 25 కాలనీల సంక్షేమ సంఘాలతో బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన కూడళ్ల, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పోలీసుల ముమ్మర గస్తీ ద్వారా తాగుబోతుల ఆగడాలు, చిల్లర దొంగతనాలకు కళ్లెం పడుతోందని ఆయన వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, సంక్షేమ సంఘం ప్రతినిధులు జగదీశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం మత్తులో పట్టుబడిన అంబులెన్స్ డ్రైవర్ రమేష్

మద్యం మత్తులో పట్టుబడిన అంబులెన్స్‌డ్రైవర్

కొత్తపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ అంబులెన్స్ డ్రైవర్ పట్టుబడ్డారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధి కర్మన్‌ఘట్ జంక్షన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సాయి గణేష్ అంబులెన్స్ డ్రైవర్ రమేష్ మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. బుధవారం ఉదయం అంబులెన్స్ డ్రైవర్ రమేష్‌ను తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఒక ఆటో, ఒక అంబులెన్స్, 14 బైకులు స్వాధీనం చేసుకుని, 16 మందిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాయమటలు చెప్పి రూ.7.40 లక్షలు వసూలు

- జ్యోతిషుడిపై నాగోలు పీఎస్‌లో కేసు నమోదు

వనస్థలిపురం, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): మనిషికి పట్టిన కీడును వదిలిస్తానని మాయమాటలు చెప్పి రూ.7లక్షలా 40వేలు డబ్బులు తీసుకుని తప్పించుకు తిరుగుతున్న జ్యోతిషుడిపై నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ సాయినగర్ కాలనీకి చెందిన పి.అనూష(35) భర్త పురుశోత్తంరెడ్డి, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. కాగా, 2024 డిసెంబరు నెలలో అనూష ఇంటికి ఓ గుర్తుతెలియని జ్యోతిషుడు వచ్చి 'నేను జాతకాలు చూస్తాను. మీ ఇంట్లో చాల సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలను పూజలతో తొలగిస్తాను. అందుకు కొంత డబ్బు ఖర్చవుతుంది' అని అనూషను నమ్మించాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకొని వెళ్లాడు. ఈ క్రమంలో అనూష అతనికి మొదటగా రూ.1500 నగదు ఇచ్చింది. అనంతరం ఆమెకు సదరు జ్యోతిషుడు రెండుసార్లు ఫోన్‌చేసి ఆమెకు మాయమాటలు చెప్పి యూపీఐ ద్వారా తన బ్యాంకు ఖాతాలో రూ.35వేల నగదును వేయించుకున్నాడు. ఆ తర్వాత రెండు, మూడు రోజులకు సదరు జ్యోతిషుడు అనూషకు ఫోన్ చేసి తాను చేసిన పూజ ఫలించలేదని, మళ్లీ పూజలు చేయాలని అందుకు రూ.2లక్షలా70వేలు ఖర్చు అవుతుందని తెలిపాడు. తన మనిషిని పంపిస్తా.. నగదు మాత్రమే ఇవ్వాలని సూచించాడు. దీంతో ఆమె అతడు పంపిన వ్యక్తికి డబ్బులు ఇచ్చి పంపింది. ఇలా పలు మార్లు యూపీఐ, ఇతర మార్గాల ద్వారా జ్యోతిషుడికి రూ.7లక్షలా 40వేలను బదిలీ చేసింది. ఇంత మొత్తంలో డబ్బులు పంపినప్పటికీ తన భర్త, పిల్లలకు ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జ్యోతిషుడు తనను నమ్మించి మోసం చేసిండని బాధితురాలు నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్‌గౌడ్, దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ దుగ్గాణి శ్యామల, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అందెకార్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

చలానాలు చెల్లించి వాహనాలు తీసుకెళ్లండి

- ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరు

కొత్తపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వాహనాలకు పెండింగ్ చలానాలు ఉంటే యజమానులు చెల్లించి, సరైన పత్రాలు చూపించి వాటిని తీసుకెళ్లవచ్చని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనల కేసుల్లో పట్టుబడిన వారికి చెందిన 50 ద్విచక్ర వాహనాలను సరూర్‌నగర్ పార్కింగ్ యార్డులో భద్రపరిచామని తెలిపారు. సదరు వాహనాల యజమానులకు పోస్టు ద్వారా నోటీసులు పంపించామని తెలిపారు. అయినా యజమానుల నుంచి స్పందన లేదని ఆయన తెలిపారు. యజమానులు వివిధ ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కేసుల్లో విధించిన జరిమానాను చెల్లించి, సరైన పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. అలా తీసుకెళ్లని పక్షంలో నిబంధనల మేరకు ఆయా వాహనాలను వేలం వేస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం.87126 62773లో లేదా నేరుగా ట్రాఫిక్ పీఎస్‌లో సంప్రదించవచ్చని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రేపు సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమం

కొత్తపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అల్కాపురి చౌరస్తా సమీపంలోని స్నేహపురి శ్రీగోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ విజయ గణపతి ఆలయంలో గురువారం సంకట హర చతుర్థి సందర్భంగా సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి వారు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు శాస్త్రోక్తంగా గణపతి పూజ తర్వాత ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం చేస్తామని తెలిపారు. అనంతరం 6.30 గంటలకు 1008 ఉండ్రాళ్లతో సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

మలక్‌పేటలో ఓ మోస్తారు వర్షం

ఓల్డ్‌మలక్‌పేట ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట, ఓల్డ్‌మలక్‌పేట, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తారు చిరు జల్లు కురిసింది. ఉదయం నుంచి ఎండతో వేడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో పూర్తిగా మారిపోయింది. మబ్బులతో ఆకాశం మేఘావృతమై ఓ మోస్తారు వర్షం కురిసింది. సుమారు అర్ధగంట పాటు కురిసిన వర్షం కారణంగా రోడ్లమీద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

విద్యార్థులకు సన్మానం



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి భువన్ కార్తీక్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలలో పాణినీయ హహ విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఐఎన్‌టీఎస్‌వో రెండో దశ ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు గ్రాండ్ ప్రైజ్‌లు పొందిన 9మంది, బంగారు మెడల్స్ సాధించిన 163 మంది, కన్సోలేషన్ బహుమతులు పొందిన 63 మంది విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం సతీష్, ఆర్‌ఐ రవీంద్ర, జోనల్ కో-ఆర్డినేటర్ రవికుమార్, డీన్ నాగేశ్వర్‌రావు, సీ బ్యాచ్ ఇన్‌చార్జి జ్యోతి, ఎస్ బ్యాచ్ ఇన్‌చార్జి సుజాత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న

రౌడీ షీటర్ అరెస్ట్



అరెస్టైన ఇమ్రాన్, పట్టుబడిన గంజాయి, మత్తు ఇంజెక్షన్లు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పాటు మత్తు ఇంజెక్షన్లను అధిక ధరలకు విక్రయిస్తున్న రౌడీషీటర్‌ను సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి మంగళవారం అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట నివాసి మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ కాలా ఇమ్రాన్(32) రౌడీ షీటర్. పాన్‌షాపు నిర్వహిస్తాడు. అయితే, ఇమ్రాన్ మెపంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, అల్ప్రజోలం టాబ్లెట్లు, గంజాయిని అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులు కలిసి దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి 110 సీసాల మెపెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, 60 అల్ప్రజోలం టాబ్లెట్లు, 3కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.07లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. రౌడీషీటర్ ఇమ్రాన్‌పై ఇప్పటికే 15 క్రిమినల్ కేసులున్నాయని, పీడీ యాక్ట్ కింద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ కోసం నిందితుడిని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం



దగ్ధమైన సామగ్రి

సైదాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించడంతో ఇంట్లో సామగ్రితో పాటు నగదు, నగలు దగ్ధమయ్యాయి. సింగరేణి కాలనీలో నివాసముండే ఇస్లావత్ రమేష్, మంజుల దంపతులు మంగళవారం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు, నాలుగు తులాల బంగారు నగలు, రూ.70 వేల నగదు దగ్ధమయ్యాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.